


మరువాడ రాజేశ్వరరావు

జగదీశ్వర్రావుగారి రెండంతస్తుల పచ్చ మేడ వెనక పెద్దతోట......రంగు రంగుల పువ్వులతోట .... ఒక పక్క కూరగాయల మొక్కలు కూడా ఉన్నాయి.

తోట వెనక మసి బారినట్టు ఎండి పోయిన తాటాకు గుడిసెల పేట. ఆ పేటలో గుడిసెల్లేని చోటల్లా బురద—వానవల్ల వచ్చింది కాదు. యిరుగ్గా ఉన్న ఆ గుడిసెలకి "డ్రెయినేజి స్కీము" వేసే శ్రద్ధ, ఓపిక—సదరు అధికారులకి లేని కారణంచేత, ఋతువుల్ని బట్టి కాక, అక్కడ నివసించేవాళ్ళ జీవనాన్నిబట్టి.... ఎప్పుడూ బురద!

బురదతో నిండిన గుడిసెల పేటకి, రంగుల పువ్వులతో నిండిన అందాల తోటకి మధ్య—పేద వాళ్ళకి, గొప్ప వాళ్లకి మధ్యనున్నంత పెద్దగోడ ఉంది. ఆగోడ అడుగున్నర మందాన, పదడుగుల ఎత్తున ఉంది. తోటలో ఉన్న అందాయిగాని, పుష్పించే సౌరభాలు కాని అనుభవించే [illegible]దాను, అవతలి వేపున్న దిగంబర దారిద్ర్యం, బురద యివతలి వేపుకి చొరబడకుండాను కాపాడే గోడ!

తోటవేపున్న గోడకి పచ్చని సున్నం వేసేరు. గోడ పైభాగాన గాజు పెంకులు, రేకుముక్కలు తాపడం పెట్టేరు. పేట వేపున్న గోడనిండా పిడకలు; పిడకల్లేనప్పుడు ఎండుపేడ పెచ్చులు!

ఆ గోడ ఎత్తుగా ఉండడంవల్ల కొద్ది దూరంలో ఉన్న మోహన్ రోడ్డుకి కూడా స్పష్టంగా కనిపిస్తుంది.

పేటలోని గుడిసెల మధ్య ఒక చిన్న గుడిసెలో డెబ్భైయేళ్ళ ముసిలామె ఉంటోంది. పదేళ్లకిందటే ఆవిడ మొగుడు పోయేడు. మరో రెండేళ్లకే గ్రెయిన్‌లో పనిచేస్తున్న ఒక్కగా నొక్కకొడుకు ఒక ప్రమాదంలో చచ్చి



పోయేడు. తరవాత ఏడాది తిరక్కుండానే కోడలు ఎవరితోటో లేచి పోయింది. ఆ గుడిసె స్థిరాస్తిగాను, రెక్కల కష్టం చరాస్తిగాను అక్కడక్కడా అంట్లు తోము కుంటూ నాలుగేళ్ళ కిందటివరకూ ఈడ్చు కొచ్చింది ముసిలమ్మ. రెక్కల్లో సత్తువ కూడా పోయేసరికి రోడ్డుమీది పేడ తట్టలో కెత్తుకుని, పేటవేస్తున్న జగదీశ్వర్రావు గారి గోడమీద పిడకలు పెట్టుకుని అమ్ము కుంటూ బతుకుతోంది. ఆ మాత్రం ఆధారమేనా చూపించి తననలా బతక నిస్తున్నందుకు రోజుకి పదిసార్లేనా ఆ "సర్వేశ్వరుడ్ని" తల్చుకుంటుంది.

* * *

ఈ దేశంలో ఉన్నది ప్రజాస్వామ్య మేనని చెప్పేందుకు, ప్రభుత్వాన్ని ప్రజలే ఎన్నుకుంటున్నారని చాటి చెప్పేందుకు అయిదేళ్ళ కోసారి ఎన్నికలు జరుగు తుంటాయి. ఈ ఎన్నికల్లో నాయకు లంతా ప్రజల యిళ్లకి వెళ్ళి, వాళ్ల యోగ క్షేమా లడుగుతూ ఉంటారు. డబ్బు విరి విగా ఖర్చు పెడతారు, ఒకరి గుట్టు ఒకరు బైట పెడుతూ ఉంటారు. ఆవేశంగా ఉపన్యాసా లిస్తారు. ఎన్నెన్నో వాగ్దా నాలు చేస్తారు. కార్లలో మైకులు పెట్టు కుని అరుస్తూ తిరుగుతారు.

ఇవన్నీ ముసిలమ్మని అంతగా బాధ పెట్టలేదు. ఒకరోజు తెల్లవారగానే పేడ కోసం తట్ట పటుకు బైల్దేరిన ముసిలమ్మ గోడవేపు చూసి....ఆశ్యర్యంతో నోరు తెరుచుకుని అలాగే ఉండిపోయింది.

గోడ గోడలాగ లేదు. రంగుల సినిమా ఆడుతున్న తెరలాగుంది........ పోస్టర్లు....పోస్టర్లమీద పెద్ద పెద్ద అక్షరాలు....రకరకాల బొమ్మలు....పిడకలు పెట్టుకోడానికి అంగుళం మేరకూడా మిగల్చకుండా కాగితాలంటించేసారు.

మహాత్ముల శాంతి బోధనల్లాగ,

పోలీసుమంత్రి అహింసా ప్రవచనాల్లాగ,

కోటీశ్వరుడు "సోషలిజా"ని కిచ్చిన నిర్వచనం లాగ.

ఆధునిక అభ్యుదయకవి శృంగార కవిత్వం లాగ,

ఆ రంగులు, ఆ అక్షరాలు, ఆ బొమ్మలు కలగా పులగంగా, హడావిడిగా చూడ్డానికి అందంగానే ఉన్నా,

ఆకలిబాధ తెలిసిన ముసిలమ్మకి పిడకలు పెట్టుకోకపోతే కడుపు నింపుకునే మార్గం లేదు కనక వాటివేపు కోపంగాను అసహ్యంగాను చూసింది.

"నాకేటి. ఆటిమీదే పిడక లెట్టుకుంతాను. ఎవులడ్డం వొస్తరో సూస్తాను" అంటూ, కుడిచేత్తో తట్ట పట్టుకుని ఎడంచెయ్యి ఊపుకుంటూ పేడ కోసం బైల్దేరింది.

* * *

గోడమీద పోస్టర్లంటించింది తెల్ల జెండా పార్టీవాళ్ళు. వాళ్ళకి ప్రజాస్వామ్యం మీద అపరిమితమైన విశ్వాసం గౌరవం ఉన్నాయి. మిగతా పార్టీలవాళ్ళకి లేవని గాఢంగా నమ్ముతుందా పార్టీ. ఆ పార్టీ తాలూకు ప్రజాస్వామిక హక్కుల్ని కాపాడేందుకు చాలామంది రౌడీలున్నారు. వాళ్ళు "పార్టీ వర్కర్ల"న బడతారు. ఆ పార్టీకి దేశం అంతటా కోటీశ్వరుల, మరాధికారుల మద్దత్తుంది. ఆ పార్టీ నాయకులు పుట్టిందగ్గర్నుంచి ప్రజల్నే ఉద్ధరిస్తున్నా మంటారు.

ఊళ్లో "పొజిషను" చూసుకుంటూ వచ్చిన పార్టీ వర్కర్లు గోడవేపుచూసి ఆశ్చర్యంతో అలాగే నిలబడి పోయేరు. —పోస్టర్ల అంచులు మాత్రమే కనిపిస్తూ గోడనిండా వరసగా పిడకలు పేర్చి ఉన్నాయి. పిడకలు పెట్టిన ముసిలమ్మ గోడపెడలో లాపీగా చుట్ట కాలుస్తూ కూర్చుంది.

"ఎవరు పెట్టేరాపిడకలంటూ" గర్జించే డొక వర్కరు.

"నానే బాబూ. ఏటలా ఎగిరి పోతన్నావు?" అంటూ కసిరింది ముసలమ్మ.

"ఏటీ దౌర్జన్యం ముసిలమ్మా, మా కాయితాలమీద పిడక లెట్టినావూ?"



"నాదా దౌర్జన్యం(వు. నాను పిడక లెట్టుకుని గోడమీద కాయితాలంటించి నా కడుపు కొడితే నాకేటొస్తదిరా? నడు నడు."

పార్టీవర్కర్లకి, ముసిలమ్మకి చాలా సేపు తగువయింది. చుట్టూ చాలామంది మూగేరు. మూగినవాళ్లు వింతచూస్తూ నిలబడ్డారేగాని, ఎటువేపూ మొగ్గుచూపించి లేదు. నిస్సహాయురాలైన ముసిలమ్మ ఎక్కువసేపు దెబ్బలాడలేక పోయింది. ఆవిడ అడ్డువడితే వెనక్కి తోసేసి, యినపరేకుతో గోడమీది పేడ ముద్దల్ని గోకేసి, మళ్ళీ పోస్టర్లంటించి వెళ్ళి పోయేరు పార్టీ వర్కర్లు.

ముసిలమ్మ ఏడుపు చూస్తే కొందరికి నవ్వొచ్చింది. మరింతగా ఏడిపించ బుద్ధయింది. కొందరు ఓదార్చేరు. ఒక రిద్దరికి మాత్రం పార్టీవర్కర్లుమీద విపరీత మైన కోపం వచ్చింది. ఏం చెయ్యలేక ఊరుకున్నారు.

* * *


ముసిలమ్మకి మూడ్రోజుల్నించి తిండి లేదు. గుడిసెలో ఒకర్తి ముడుచు కూర్చుంది.

కాళ్లు, చేతులు మొద్దుబారినట్టైపోయి నీరసంగాను, మగతగానుఉంది. ముడతల వడి తడారిన చర్మం పొట్టులాగుంది. మధ్యలో మూలుగుతూ, ఏడుస్తూ, మగ తగా జోగుతోంది.

ఆ రోజే ఎన్నికలు

ఊరంతా హడావిడిగా ఉంది. పార్టీల వర్కర్లు జనాన్ని రిక్షాలెక్కించుకొని, లారీలమీద, బస్సులమీద, టేక్సీలమీద తీసుకుపోయి ఓట్లేయించుకుంటున్నారు. కొందరు మళ్ళీ మళ్ళీ వెళ్ళి ఎవరెవరి వోట్లో వేసేస్తున్నారు. కొందరు వోటు ఖరీదు గురించి బేరాలాడుతున్నారు. బూతులు తిట్టుకుంటున్నారు. మూల మూలల్నించి మనుషుల్నెత్తుకొస్తున్నారు పార్టీల వర్కర్లు.

సాయంత్రం అవుతుండగా తెల్ల జెండా పార్టీవర్కరు ముసిలమ్మ గుడిసె లోకి ప్రవేశించేడు.




"ముసిలమ్మా, వోటేసేవా?"

"ఎవరూ!"

గొణుగుతున్నట్టుంది ముసిలమ్మ.

"పద, పద కారొచ్చింది. వోటేద్దువు గాని పద....తెల్లజెండాకే వోటెయ్యి."

"నా(న్రా)లేసు బాబూ."

"నేనెత్తిసికెళ్తాను కదా ముసిలమ్మా" అంటూ రెండు చేతుల్లోనూ ఎత్తుకు తీసుకెళ్ళి జీపులోకూర్చోపెట్టేడు.


"నాన్నచ్చి పోతన్నా(న్రా) కొడుకా.... నన్నొగ్గరా బగమంతుడా" అంటూ ఏడుస్తోంది ముసిలమ్మ.

"ఇయ్యాళ్తో ఆఖరురోజు ముసిలమ్మా. రేపణ్ణించి నీ గోడమీద పిడకలెట్టుకుందువులే."

తెల్లజెండా పార్టీ వర్కరుని అప్పుడు పోల్చుకుంది ముసిలమ్మ.

"వోటే(న్రా)టా ముదనష్టపోడా? నా కడుపు కొట్టి నన్నే వోటెయ్యమంటన్నావురా సచ్చినోడా? నీ వోటుకోసఁవు నన్ను సంపినావు కదురా? నన్నొదులు.... నాకే వోట్లొద్దు....నాకే కార్లొద్దు........ నన్నొగిపో...."

ముసిలమ్మ అరుస్తుండగానే జీపు "పోలింగ్ బూత్" దగ్గరాగింది. అందరూ దిగేరు.




"దిగు ముసిలమ్మా వోటెయ్యి. తెల్లజెండాకే .."

ముసిలమ్మ జీపు దిగిందికాని వోటెయ్యడాని కొప్పుకోలేదు. ఎన్ని చెప్పినా, ఎంత బతిమాలినా ముసిలమ్మ విన్లేదు. మూడు రోజుల్నించి ఆకలి మంటతో "వోటు" నుసే, మసే అయి పోయింది!

ఒక్కర్తి గుడిసెవేపు తడుంవుకుంటూ తూలుకొంటూ నడిచింది. నేలమీదికి వంగి, ఏదో జంతువు పాకుతున్నట్టు నడుస్తోంది.

"రేపట్నించి మళ్ళీ పిడకల పెట్టుకో వచ్చు, వొంట్లో ఏ మాత్రం సత్తువ లేక పోయినా, ఆ సంతోషంతో, ఆ ఆశతో మెల్లిగా నడుస్తోంది.

* * *

ఎన్నికల హడావిడి చూసిన ఒక రేడియో కంపెనీ ఏజంటుకి ఆ గోడ బాగా నచ్చింది. మెయిన్ రోడ్డు మీదికి స్పష్టంగా కనిపిస్తుంది. జగదీశ్వర్రావు గార్ని కలసుకొని, తమ రేడియో కంపెనీ ఎడ్వర్టైజ్‌మెంటుకి గాను ఆ గోడని అద్దెకి తీసుకుంటూ "అగ్రిమెంటు" మీద సంతకం చేసేడు. ఎన్నికల రోజు సాయంత్రం గోడమీది పోస్టర్లన్నీ పీకించేసి, కుదురుగా, అందమైన పెద్ద అక్షరాలతో "కంపెనీ రేడియోలనే కొన"మని రాస్తూ ఉండగా,-

మసక మసగ్గా కనిపిస్తున్న కళ్ళలోంచి ఆ దృశ్యం చూచిన ముసలమ్మ ఓపిక లేక అలాగే కూలబడి పోయింది....

ఆ గోడ స్వతంత్ర భారత దేశం లాగుంది!

———